

సత్యవాక్కు
THE WORD OF TRUTH
క్రైస్తవ మాసపత్రిక
NOVEMBER - 2004




ప్రతి మంగళవారం : ఉదయం 6:30 గం॥లకు

**మా టి.వి.**లోను

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు

**తేజ ఛానల్** లోను చూడండి.

ప్రతి గురువారం : **SITI కేబుల్ & IN కేబుల్‌లో**

(కాకినాడలో మాత్రమే)

ఉదయం 7:00 గంటలకు,

సాయంత్రం 5:30 గంటలకు

ప్రసంగీకులు : Bro. **జాషువా గూటం**

సత్యసువార్తను వినండి !!

మీ బంధు మిత్రులకు వినిపించండి !!!

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటిక 25 | నవంబర్ 2004 | సంచిక 4


## మారుమనస్సు

(Repentance)

"ఏ బేధమును లేదు; అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" (రోమా 3:23). గనుక మానవులు అందరూ అంతటా మారుమనస్సు పొందవలెనని దేవుడు ఆజ్ఞాపించుచున్నాడు (అపొ.కా. 17:30). మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరు నశింతురు అని యేసు చెప్పుచున్నారు (లూకా 13:3).

మారుమనస్సు అనగా యేమిటి? మారుమనస్సు అనగా మనస్సును మార్చుకొనుట. గతములో చేసిన పాపములను అసహ్యించు కొనుచు సద్వర్తనునిగా జీవించుటకు నిశ్చయించుకొనుట. ఒకని పాపముల విషయమై దుఃఖపడుచు తన పాపపు జీవితంలో మార్పును చేయుట, మారుమనస్సు. మారుమనస్సు అనగా విచారించుట మాత్రమే కాదు, లేదా దిద్దుబాటు చేసికొనుట కాదు. "దైవ చిత్తానుసారమైన దుఃఖము రక్షణార్థమైన

మారుమనస్సును కలుగజేయును; ఈ మారుమనస్సు పశ్చాత్తాపమును పుట్టించదు. అయితే లోక సంబంధమైన దు:ఖము మరణమును కలుగజేయును" (2 కొరింధి 3:10). మారుమనస్సు పొందుట వలన ఒకని జీవితములో దిద్దుబాటు కన్పబడును. అయితే దిద్దుబాటు మారుమనస్సు కాదు. పరిసయ్యులలోను, సద్దూకయ్యుల లోను అనేకులు యోహాను దగ్గరకు బాప్తిస్మము పొందుటకు రాగా అతడు - "సర్పసంతానమా, రాబోవు ఉగ్రతను తప్పించుకొనుటకు మీకు బుద్ధి చెప్పిన వాడెవడు? మారుమనస్సునకు తగిన ఫలము ఫలించుడి" అని వారిని హెచ్చరించెను (మత్తయి 3:8).

పాత నిబంధనలో మనము చూచిన యెడల మారుమనస్సును గూర్చి దేవుడు తన ప్రజలను పదే పదే హెచ్చరించుచున్నట్లు మనము చూడగలము. యెహెజ్కేలు 14:6లో ఇశ్రాయేలీయులకు "ప్రభువైన యెహోవా సెలవిచ్చిన దేమనగా, మీ విగ్రహములను విడిచిపెట్టి మీరు చేయు హేయకృత్యములన్నిటిని మాని మనస్సు త్రిప్పు కొనుడి" యని వ్రాయబడి యున్నది. యెహెజ్కేలు 18:30-32లో చూచిన ఆయన ఈ విధంగా హెచ్చరించుచున్నారు: "కాబట్టి ఇశ్రాయేలీయులారా, యెవని ప్రవర్తనను బట్టి వానికి శిక్ష విధింతును. మనస్సు త్రిప్పుకొని మీ అక్రమములు మీకు శిక్షాకారణములు కాకుండునట్లు వాటి నన్నిటిని విడిచిపెట్టుడి. మీరు జరిగించిన అక్రమ క్రియలన్నిటిని విడిచి నూతన హృదయమును, నూతన బుద్ధియు తెచ్చుకొనుడి. ఇశ్రాయేలీయులారా, మీరెందుకు మరణము నొందుదురు? ఇదే ప్రభువగు యెహోవా వాక్కు. మరణము నొందువాడు మరణము నొందుటను బట్టి నేను సంతోషించు వాడను కాను. కావున మీరు మనస్సు త్రిప్పుకొనుడి. అప్పుడు మీరు బ్రదుకుదురు; ఇదే ప్రభువగు యెహోవా వాక్కు".

క్రొత్త నిబంధనలో బాప్తిస్మమిచ్చు యోహాను, "పరలోక రాజ్యము సమీపించి యున్నది, మారుమనస్సు పొందుడి" యని బోధించుచు వచ్చెను (మత్తయి 3:2). యేసు క్రీస్తు కూడ మారుమనస్సును ప్రకటించెను. మారుమనస్సును గూర్చి బోధించుచు ఆయన అనేక ఉపమానములు చెప్పెను. యేసు యొక్క శిష్యులు, అపొస్తలులు మారుమనస్సును ప్రజలలో ప్రకటించిరి. దీనిని బట్టి మానవులు పాప విముక్తి పొందవలెనంటే, వీరు పాప విసర్జన చేయుటయే గాక, దేవుని చిత్తమును జరిగించు

టకు నిశ్చయించుకొనవలెనని మనకు గ్రహింపగుచున్నది.

మారుమనస్సు అనగా మనస్సును మార్చుకొనుటయే అని ముందు మనము చెప్పుకొన్నాము. మనస్సులో కలిగిన మార్పును జీవితములోను కూడ కనబరుచుటయే మారుమనస్సు. యేసు ఒక చిన్న ఉదాహరణను ఇట్లు చెప్పుచున్నారు. "ఒక మనుష్యునికి ఇద్దరు కుమారులుండిరి. అతడు మొదటివాని యొద్దకు వచ్చి - కుమారుడా, నేడు పోయి ద్రాక్షతోటలో పనిచేయుమని చెప్పగా వాడు - పోను అని యుత్తర మిచ్చెను గాని పిమ్మట మనస్సు మార్చుకొని పోయెను. అతడు రెండవవాని యొద్దకు వచ్చి ఆ ప్రకారమే చెప్పగా వాడు అయ్యా పోదుననెను గాని పోలేదు" (మత్తయి 21:28, 29). మారుమనస్సులో రెండు ప్రాముఖ్య ఘట్టములున్నవి. మొదటిగా మన మనస్సును దేవునికి అర్పించుట, రెండవదిగా - పాపమును విసర్జించుటయే. మొదటి కుమారుని యొద్దకు తండ్రి వచ్చి తన ద్రాక్షతోటలో పనిచేయుమని చెప్పగా పోను అని అతడు జవాబిచ్చెను. గాని అతడు మనస్సు మార్చుకొనిపోయి పొలములో పనిచేసెను. మీరు మారుమనస్సు పొంది దానికి తగిన ఫలములను ఫలించుడి యని యోహాను హెచ్చరించెను.

తప్పిపోయిన కుమారుని గూర్చి యేసు చెప్పిన ఉపమానము మన హృదయములను కరిగించునది. ఈ చిన్న కుమారుడు తన తండ్రి నుండి తనకు వచ్చు తన ఆస్థిని సమకూర్చుకొని దూరదేశమునకు పోయి అచ్చట తన ఆస్థిని దుర్వ్యాపారము వలన పాడుచేసెను. అదంతయు వాడు ఖర్చుచేసిన తరువాత ఆదేశమందు గొప్ప కరవు రాగా వాడు ఇబ్బంది పడసాగి వెళ్ళి ఆ దేశస్థులలో ఒకని యొద్ద పందులను మేపుటకు కుదిరెను. వాడు పందులు తిను పొట్టుతో తన కడుపు నింపుకొన ఆశపడెను గాని యెవడును వానికేమియు ఇయ్యలేదు. అయితే బుద్ధి వచ్చినప్పుడతడు లేచి తన తండ్రి యొద్దకు వెళ్ళి - తండ్రీ, నేను పరలోకమునకు విరోధముగాను, నీ యెదుటను పాపము చేసితిని; ఇక మీదట నీ కుమారుడనని అనిపించుకొనుటకు యోగ్యుడను కాను; నన్ను నీ కూలివారిలో ఒకనిగా పెట్టుకొనుమని చెప్పెను (లూకా 15:11-32).

ఈ తప్పిపోయిన కుమారుడు పాపము వలన తన తండ్రి నుండి దూరమైపోయెను. అయితే బుద్ధి వచ్చినప్పుడు, అనగా తన ఘోరదుస్థితిని అతడు గ్రహించుకొనినప్పుడు దానిలో నుండి బయట పడుటకు నిశ్చయించుకొనెను. మనఃపరివర్తనను

ఇందులో మనము చూడగలము. అతడు అట్లు నిశ్చయించు కొనుటయే గాక వెంటనే, తక్షణమే లేచి తన తండ్రి యొద్దకు వెళ్ళెను. అతడు ఎంత నీచస్థితిలో యున్నను తండ్రి అతని మెడమీద పడి ముద్దు పెట్టుకొని ఒక కుమారుని వలె తన యింట చేర్చు కొనెను. ఈ తప్పిపోయిన కుమారుడు తిరిగి రాగా తన తండ్రి యింటిలో ఎట్టి సంతోషము కలిగెనో "అటువలె మారుమనస్సు పొందు ఒక పాపి విషయమై దేవుని దూతల యెదుట సంతోషము కలుగునని" యేసు బోధించెను (లూకా 15:10). "నీనెవెవారు యోనా ప్రకటన విని మారుమనస్సు పొందిరి గనుక విమర్శ సమయమున నీనెవెవారు ఈతరము వారితో నిలువబడి వారిమీద నేరస్థాపన చేయుదురు" అని ఆయన బోధించెను (మత్తయి 12:41).

మారుమనస్సు పొందని యెడల మన కేమి కలుగును? మారుమనస్సు పొందని యెడల మీరందరును నిత్య నరకాగ్నిలో నశింతురు అని యేసు చెప్పెను (లూకా 13:3). దేవుని కృప మనందరి యెడల ఇంకను విస్తరించి యున్నందున ఆయన మన యెడల సహనము కలిగి యున్నారు. తమ్మ పాపముల విషయమై మారుమనస్సు పొందని వారికి తీర్పు తీర్చుటకు ఆయన త్వరలో రాబోవుచున్నాడు. "కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు మీ యెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు" (2 పేతురు 3:9). "దేవుని అనుగ్రహము మారుమనస్సు పొందుటకు నిన్ను ప్రేరేపించు చున్నదని యెరుగక, ఆయన అనుగ్రహైశ్వర్యమును, సహనమును, దీర్ఘశాంతమును తృణీకరించుదువా? నీ కాఠిన్యమును, మార్పు పొందని నీ హృదయమును అనుసరించి ఉగ్రతదినమందు అనగా దేవుని న్యాయమైన తీర్పు బయలు పరచబడు దినమందు నీకు నీవే ఉగ్రతను సమకూర్చుకొనుచున్నావు. ఆయన ప్రతివానికి వాని వాని క్రియల చొప్పున ప్రతిఫల మిచ్చును. సత్క్రియను ఓపికగా చేయుచు, మహిమను, ఘనతను, అక్షయతను వెదకు వారికి నిత్య జీవము నిచ్చును. అయితే భేదములు పుట్టించి, సత్యమునకు లోబడక దుర్నీతికి లోబడు వారి మీదికి దేవుని ఉగ్రతయు, రౌద్రమును వచ్చును" (రోమా 2:4-8).

దేవుని ఉగ్రత నుండి తప్పించుకొనవలెనంటే, రక్షణ పొందవలెనంటే యేసు దేవుని కుమారుడు అని విశ్వసించుడి. అట్లు

నమ్మిన తరువాత మీ పాపముల నుండి వైదొలగి ఆయన చెప్పిన రీతిగ చేయుటకు నిశ్చయించుకొనుడి. "మీరు మారుమనస్సు పొంది మీలో ప్రతివాడును పాపక్షమాపణ నిమిత్తము యేసు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు పరిశుద్ధాత్మ అను వరమును మీరు పొందుదురు" (అపొ.కా. 2:38). మీరు మారుమనస్సు పొందని యెడల మోక్షములో చేరలేరు సుమా!

- జాషువా గూటం

*ఉపమానమాలిక :*

# పదిమంది కన్యకలు

(The Ten Virgins)

*మత్తయి 25 : 1-13*

యేసు క్రీస్తు చెప్పిన మరియొక ఉపమానము ఇట్లున్నది : "పరలోక రాజ్యము తమ దివిటీలు పట్టుకొని పెండ్లికుమారుని ఎదుర్కొనుటకు బయలుదేరిన పదిమంది కన్యకలను పోలి యున్నది. వీరిలో అయిదుగురు బుద్ధిలేనివారు, అయిదుగురు బుద్ధిగలవారు. బుద్ధిలేనివారు తమ దివిటీలు పట్టుకొని తమతో కూడ నూనె తీసికొని పోలేదు. బుద్ధిగలవారు తమ దివిటీలతో కూడ సిద్దెలలో నూనె తీసికొని పోయిరి. పెండ్లి కుమారుడు ఆలస్యము చేయగా వారందరు కునికి నిద్రించుచుండిరి. అర్ధ రాత్రి వేళ - ఇదిగో పెండ్లి కుమారుడు, అతని ఎదుర్కొనరండి అను కేక వినబడెను. అప్పుడు ఆ కన్యకలందరు లేచి తమ దివిటీలను చక్కపరచిరిగాని బుద్ధిలేని ఆకన్యకలు, మా దివిటీలు ఆరిపోవుచున్నవి గనుక మీ నూనెలో కొంచెము మాకియ్యుడని బుద్ధిగలవారి నడిగిరి. అందుకు బుద్ధిగల కన్యకలు మాకును మీకును ఇది చాలదేమో, మీరు అమ్మువారి యొద్దకు పోయి కొనుక్కొనుడని చెప్పిరి. వారు కొనబోవు చుండగా పెండ్లి కుమారుడు వచ్చెను, అప్పుడు సిద్ధపడి యున్నవారు అతనితో కూడ పెండ్లి విందుకు లోపలికి పోయిరి; అంతట తలుపు వేయబడెను. ఆ తరువాత తక్కిన కన్యకలు వచ్చి అయ్యా, అయ్యా మాకు తలుపు తీయుమని అడుగగా అతడు మిమ్ము నెరుగనని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. ఆ దినమైనను గడియయైనను మీకు తెలియదు గనుక మెలకువగా ఉండుడి" (మత్తయి 25:1-13).

ఈ ఉపమానములో పరలోక రాజ్యము సంఘమై యున్నది. రక్షింపబడిన

వారే సంఘము. కన్యకలు పవిత్రతను సూచించుచున్నారు. పెండ్లి కుమారుడు క్రీస్తు. ఆయన మరల వచ్చు సమయం ఎవరికి తెలియదు. పెండ్లి కుమారుని రాక అంటే క్రీస్తు యొక్క రెండవ రాకడ; లేదా మానవుని మరణము, తీర్పు అనునవి. అవి ఎప్పుడు సంభవించునో ఎవరికి తెలియదు. తలుపు మూయబడుట అంటే, మానవుడు చనిపోయినప్పుడు, లేదా క్రీస్తు మరల వచ్చినప్పుడు మారుమనస్సు పొందాలన్నా, జీవితాన్ని సరిచేసుకోవాలన్నా ఇక అవకాశ ముండదు, ఈ ఉపమానము యొక్క ముఖ్యోద్దేశము క్రీస్తు మరల వచ్చువరకు ఆయన శిష్యులు, లేక సంఘము మెలకువగా యుండాలి, ఎల్లవేళలయందు సిద్ధపడి యుండాలి.

పెండ్లికుమారుడు తన మిత్రులతో కలసి పెండ్లి కుమార్తె గృహమునకు వెళ్లి ఆమెను తీసికొని వచ్చుట యూదుల ఆచారము. ఆమె కూడ తన మిత్రులతో కలసి అతనితో బయలు వెళ్లును. మిగిలిన వారు పెండ్లి వారితో కలసి లోపలికి వెళ్లడానికి పెండ్లి కుమారుని యింటిదగ్గర కనిపెట్టుచు యుంటారు. యేసు ప్రభువు చెప్పిన ఉపమానములోని కన్యకల యొక్క పాత్ర యిది : వారు పెండ్లి కుమారునికి ఆనందోత్సాహములతో స్వాగతం పలుక వలసి యున్నది. "ఇదిగో పెండ్లి కుమారుడు, అతనిని ఎదుర్కొన రండి అను కేక, అర్ధ రాత్రి వేళ వినబడెను". అయితే పదిమంది కన్యకలలో అయిదుగురు సిద్ధపడి యుండిరి, అయిదుగురు ఆఖరి క్షణంలో సిద్ధపడ నారంభించిరి. అయిదుగురు బుద్ధిగలవారు, అయిదుగురు బుద్ధి లేనివారు.

బుద్ధిలేనివారంటే సమర్థత లేనివారు. గాని...."యీ నా మాటలు విని వాటి చొప్పున చేయని ప్రతివాడు ఇసుక మీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిహీనుని పోలియుండు నని" యేసు ప్రభువు చెప్పారు (మత్తయి 7:26). బుద్ధిలేని వారంటే మార్పు జెందని వారు కారు. నిజానికి వారు రక్షింపబడిన వారే. నశించినవారు ఏవిధంగాను సిద్ధపడి యుండరు. మరల, వారు విశ్వాస భ్రష్టులుకూడ కాదు. వారు విశ్వాస పరిత్యాగం చేసినవారు కాదు. గాని ఈ బుద్ధిలేని కన్యకలు మార్పు జెందినవారు, క్రైస్తవులు. వారు కొంతకాలము మట్టుకు నమ్మకముగా యున్నవారు.

బుద్ధిలేని కన్యకలు తమ దివిటీలను తీసుకెళ్లారు గాని దివిటీలలోనికి అదనపు నూనెను తీసికొని వెళ్లలేదు. వారు క్రైస్తవులయ్యారు గాని క్రైస్తవ జీవమునకు

కావలసిన ఆత్మీయాహారాన్ని గైకొనలేక పోయారు. వారి హృదయము రాతి నేలను పడిన విత్తనమువలె యున్నది. రాతినేలను పడిన విత్తనములు మన్ను లోతుగా ఉండ నందున అవి వెంటనే మొలచును గాని సూర్యుడు ఉదయించునప్పుడు అవి మాడి వేరు లేనందున ఎండిపోవును. రాతి నేలను విత్తబడినవాడు వాక్యము విని వెంటనే సంతోషముతో దానినంగీకరించువాడు. అయితే అతనిలో వేరు లేనందున అతడు కొంతకాలము నిలుచునుగాని, వాక్యము నిమిత్తము శ్రమయైనను హింసయైనను కలుగగానే అభ్యంతరపడునని యేసు ప్రభువు చెప్పారు (మత్త 13:5; 20-21).

మేము సరిపడునంతగా సిద్ధపడ్డామని బుద్ధిలేని కన్యకలు తలంచారు. మేము క్రైస్తవ జీవితమును సరిగానే జీవించు చున్నామని కొందరు తలుస్తారు గాని వారు సంఘారాధనలను నిర్లక్ష్యము చేస్తారు, హిత బోధను నిర్లక్ష్యము చేస్తారు. బుద్ధిలేని వారు క్రీస్తు రాకడలో సిద్ధపడదామనుకొంటారు. చివరిగడియలో ఆరిపోవుచున్న తమ విశ్వా సాన్ని వెలిగింప ప్రయత్నిస్తారు గాని, అప్ప టికే వారికి తలుపు మూయబడతాది.

బుద్ధిగల కన్యకలు తమ దివిటీలను, మరియు అదనంగా నూనెను కూడ తీసు కెళ్లారు. ఏమో పెండ్లి కుమారుడు ఎప్పుడు వచ్చునో తెలియదు గనుక అన్ని వేళలందు వారు సిద్ధపడి యున్నారు. "కాబట్టి యీ నా మాటలు విని వాటి చొప్పున చేయు ప్రతివాడును బండమీద తన యిల్లు కట్టు కొనిన బుద్ధిమంతుని పోలి యుండునని" యేసు ప్రభువు బోధించారు (మత్త 7:24).

బుద్ధిగలవారు భవిష్య దృష్టి గలవారు. వారు తమ ఊహలను బట్టి, భావములను బట్టి గాక దేవుని వాక్యము చేత నడిపింప బడువారు. వారు తమ పిలుపును యేర్పా టును నిశ్చయం చేసికొన్న వారు (2 పేతురు 1:9, 10). ఎల్లప్పుడు సిద్ధపడి యున్నవారు.

బుద్ధిహీనులు ప్రభువు రాకడ కొరకు సిద్ధపడి యుండనందున కావలసిన సమయ మందే వారి దివిటీలు ఆరిపోవడం మొదలు పెట్టాయి. వారి దివిటీలు, వారి జీవితములు ఒకానొకప్పుడు క్రీస్తు కొరకు ప్రకాశించాయి. వెలుతురును వేడిమిని కలుగజేసాయి, గాని క్రీస్తు రాకడలో అవి నిర్జీవమై పోయాయి.

బుద్ధిగలవారు తమ దివిటీలతో కూడ సిద్దెలలో నూనె తీసికొనిపోయారు. పెండ్లి కుమారుడు వచ్చుసరికి సిద్ధపడి యున్నారు; దేవుని దినపు రాకడకొరకు కనిపెట్టుచు ఆశతో ఆపేక్షించుచు పరిశుద్ధమైన ప్రవర్తన తోను, భక్తితోను ఎంతో జాగ్రత్తగ తమ

జీవితములు జీవించారు (2 పేతురు 3:11, 12).

బుద్ధిహీనులు నూనె కొనడానికి వెళ్లారు, బుద్ధిగలవారు పెండ్లి కుమారునితో విందుకు లోపలికి ప్రవేశించారు. బుద్ధిహీనులు ఇంక సిద్ధపడుచుండగా పెండ్లి కుమారుడు వచ్చాడు, లోపలనున్న వారికి ఆనందముగను, బయట నున్నవారికి దుఃఖముగను ఉండునట్లు తలుపు మూయబడెను. చివరికి బుద్ధిలేని వారు వచ్చి తలుపు తీయుమని అడుగగా, మీరెవరో నేనెరుగనని ప్రభువు వారికి చెప్పారు.

నీవు ప్రభువు రాకడకు సిద్ధపడి యున్నావా? ప్రభువు నందు విశ్వాసివి యైతే మరణ పర్యంతము, లేదా, ఆయన వచ్చు పర్యంతము సిద్ధపడియే యుందువని నా నిరీక్షణ, నీవు సిద్ధపడవలసిన సమయం ఇప్పుడే !

- జాషువా గూటం

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్యవాణి' టి.వి. కార్యక్రమములను ప్రతి మంగళవారం ఉదయం 6:30 గం॥లకు MAA టి.వి. లోను మరియు ప్రతి శనివారం ఉదయం 6:30 గం॥లకు తేజ ఛానల్ లోను చూడండి.

'సత్యవాణి' రేడియో కార్యక్రమాలను ఆది, సోమ, బుధ వారల్లో మధ్యాహ్నం 2:00 గంటలకు రేడియో శ్రీలంక ద్వారా వినండి. మీ బంధు మిత్రులకు విన్నవించండి !!

# షేబ దేశపు రాణి

(The Queen of Sheba)

బహుజన సమూహములు ఆయన యొద్దకు కూడి రాగా వారి యొక్క తిరుగుబాటు స్వభావముతో కూడిన హృదయ స్థితి నెరిగినవాడై ప్రభువైన యేసు ఈ విధముగా చెప్పెను. "దక్షిణదేశపు రాణి విమర్శ కాలమున ఈతరము వారితో కూడ లేచి వారిమీద నేరస్థాపన చేయును. ఆమె సొలొమోను జ్ఞానమును వినుటకు భూమ్యంతముల నుండి వచ్చెను. ఇదిగో సొలొమోను కంటె గొప్పవాడిక్కడ నున్నాడు" (లూకా 11:31). ఈ షేబ దేశపు రాణి ఆదినములలో యుండిన రాజులందరిలోను చాల ఘనత కెక్కినది. ఆమె సొలొమోను జ్ఞానమును గూర్చియు, అతని ఐశ్వర్యమును గూర్చియు, యెహోవా నామమును గూర్చియు విని గూఢార్థము గల మాటలచే అతనిని శోధించుటకై వచ్చెను (1 రాజులు 10:1-3).

షేబ దేశపు రాణి ఆమె వినిన దానిని గూర్చి చూచి తెలుసుకొనుటకును, ఇశ్రాయేలీయులతో వర్తక వ్యాపారము జరిగించుకొనుటకును వచ్చెనందురు. కాని ప్రభువైన యేసు ఆమె సొలొమోను జ్ఞానమును గూర్చి తెలిసి కొనుటకే వచ్చెనని మాటల ద్వారా తెలియ పరచెను. ఆమె ప్రయాణము చేసిన దూరము సుమారు 1200 నుండి 2000 మైళ్లు వరకు గలదు. అప్పటి ఆచార ప్రకారము ఆమె రాజైన సొలొమోనుకు బంగారమును, విస్తారమైన గంధ వర్ణమును రత్నములను ఇచ్చెను. ఆమె రాజ్యమునకు, పరిపాలనకు సంబంధించిన అనేక విషయ ములను తెలిసికొనుటకు, ఆమె పరిపాలనా సంబంధమైన అనేక ప్రశ్నలను జ్ఞానియైన సొలొమోను ద్వారా తెలిసికొనుటకును వచ్చెను. నీ కార్యములను గూర్చియు, జ్ఞానమును గూర్చియు నా దేశమందు నేను వినిన మాట నిజమే; అయినను నేను వచ్చి కన్నులారా చూడక మునుపు ఆ మాటలను నమ్మక యుంటిని; ఉన్నవాటిలో సగమైనను నాతో చెప్పబడి యుండలేదని యిప్పుడు నేను తెలిసికొనుచున్నాను...... నీతి న్యాయములన నను సరించి రాజకార్యములను జరిగించుటకు ఆయన నిన్ను నియమించెను (1 రాజులు 10:6-9) అని ఆమె చెప్పెను.

సొలొమోను యింకను చిన్నవాడుగ యుండినపుడు ఇశ్రాయేలీయులను పరిపాలించే బాధ్యత గలవాడై నందున దేవుడైన

యెహోవా తనకు యేమి కావలెనో కోరుకొనుమని చెప్పెను. అప్పుడు సొలొమోను జ్ఞానమును, వివేచనను, దేవుని జనాంగమైన ఇశ్రాయేలీయులను సమర్ధతతో పరిపాలించ గలిగే నేర్పరి తనమును అడిగెను (1 రాజులు 3:5-14). సొలొమోను అడిగిన వన్నియు దేవుడతని కనుగ్రహించెను. ఐశ్వర్యమును, ఘనతను అడుగక పోయినను వాటిని కూడ సొలొమోనుకు దేవుడనుగ్రహించెను. యెహోవాకు విరోధమైన జ్ఞానమైనను, ఆలోచనయైనను, వివేచనయైనను నిలువదు (సామె 21:30). సొలొమోనుకు దేవుని నుండి కలిగిన ఈ గొప్ప జ్ఞానమును గూర్చి విని అట్టి జ్ఞాన మును సంపాదించు విధమును తెలిసి కొనుటకు ఆమె వచ్చెను.

అయితే జ్ఞానియైన వాడెవరు? ఈలోక జ్ఞానము దేవుని దృష్టికి వెఱ్ఱితనమే. అధికమైన విద్య సంపాదించి ఉన్నతమైన పదవులలో యుండి నప్పటికిని దేవుని మాటలయందు శ్రద్ధ వహించక, ఆయన ఆజ్ఞల ననుసరించి నడువనిచో అట్టి వారి జ్ఞానము వెఱ్ఱితనమే. జ్ఞానమును గూర్చి సొలొమోను మహారాజు చెప్పిన కొన్ని విషయములు: 1. ఉపదేశము నంగీకరించు వాడు జ్ఞాని (సామె 10:8; 12:15). 2. జ్ఞానుల నాలుక మనోహరమైన జ్ఞానాంశములను పలుకును (సామె 15:2). 3. తల్లి దండ్రులకు విధేయుడగువాడు జ్ఞాని (13:1). 4. తన పెదవులను మూసు కొనువాడు బుద్ధిమంతుడు (సామె 10:19; 14:17). 5. రాబోవు దినముల కొరకు సిద్ధపడువాడు జ్ఞాని. వేసవికాలమున కూర్చు వాడు బుద్ధిగల కుమారుడు (సామె 10:5). మోషే కూడ ఇశ్రాయేలీయుల ప్రజలను గూర్చి ఈ మాట చెప్పుచున్నాడు (ద్వితీయోప 32:29). 6. జ్ఞానము గలవారు ఇతరులను రక్షించుదురు (సామె 11:30). 7. ద్రాక్షారసము వెక్కిరింతల పాలు చేయును. మద్యము అల్లరి పుట్టించును. దాని వశమైన వారందరు జ్ఞానము లేనివారు (సామె 20:1). 8. పరిశుద్ధతను కాపాడు కొనువాడు జ్ఞాని (సామె 5:1-5; 7:6-27). 9. జ్ఞానము గలవాడు భయపడి కీడునుండి తొలగును (సామె 14:16).

**సొలొమోను కంటె గొప్పవాడైన యేసు:** సొలొమోను యొక్క జ్ఞానాంశములను మనము అనేకములు చదువు చున్నాము. సామెతల గ్రంథములో జ్ఞానమును అనేకసార్లు సొలొమోను క్రీస్తు ప్రభువుతో సరిపోల్చుటను మనము గమనించవలెను. అయితే సొలొమోను జ్ఞానము కంటె మిన్నయైన జ్ఞానము క్రీస్తు నందు గలదు. బుద్ధి విజ్ఞానముల సర్వ సంపదలు ఆయన యందే గుప్తములై

యున్నవి (కొలస్స 2:3). ఆయన మాటలను పెడచెవిని పెట్టువారిని గూర్చి విమర్శదినమందు దక్షిణ దేశపు రాణి వారిమీద నేరస్థాపన చేయునని చెప్పుచున్నారు. షేబ దేశపు రాణి యదార్థతను గుర్తించి దాని ప్రేమించి దానిని గూర్చి తెలిసికొనుటకు భూమ్యంతముల నుండి వచ్చినది. ఆయన మాటలు విని వాటిని గైకొనువాడు బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలి యుండునని యేసు చెప్పుచున్నారు (మత్తయి 7:23-25). ఇదంతయు వినిన తరువాత తేలిన ఫలితార్థమిదే; దేవుని యందు భయభక్తులు కలిగి యుండి ఆయన కట్టడలననుసరించి నడచుచుండవలెను. మానవ కోటికి ఇదియే విధి (ప్రసంగి 12:13). మన ప్రభువైన క్రీస్తు ఆయన కట్టడలకు విధేయులై జీవించుయే జ్ఞాన సారాంశమని చెప్పుచున్నారు. తనకు విధేయులైన వారందరికి ఆయన నిత్య రక్షణకు కారకుడాయెను (హెబ్రీ 5:9). ఇట్టి పరమార్థమైన జ్ఞానము యొక్క విలువ:1. అది ఐశ్వర్యము (సామె 3:14-15). 2. అది జీవము (8:35) 3. సంతోషము నిచ్చును (3:13). 4. అది జీవముగను, అలంకారము గను యుండును (3:21-24; 2:3).

1. ఈ జ్ఞానము యిచ్చువాడు యెహోవాయే (సామె 2:6). 2. యెహోవా యందు భయభక్తులు కలిగియుండుట తెలివికి మూలము (సామె 1:7). 3. మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగ యున్న యెడల అతడు దేవుని అడుగవలెను, అప్పుడది అతని కనుగ్రహించబడును (యాకోబు 1:5). మనము జ్ఞానము కొరకు ప్రార్థించినను దేవుని చిత్తమునకు లోబడనట్లయిన దానినిపొందలేము. 4. జ్ఞానుల సహవాసము చేయువాడు జ్ఞానము గలవాడగును (సామె 13:20).

షేబ దేశపు రాణి సొలొమోను యొక్క జ్ఞానమును గూర్చి విని దానిని తెలిసికొని, అభ్యసించుటకు దూరమును లక్ష్యపెట్టక తెలిసికొని, ఎంతో సమయమును దాని కొరకు వెచ్చించి జ్ఞాన లాభమును పొంది యుండుటచే షేబ దేశపు రాణిని మనము జ్ఞాపకము చేసికొనుచున్నాము.

- లోటీ బెత్ హోచ్స్

# ఏ భేదమును లేదు

(There is no defference)

యూదులు, అన్యులను ఉద్దేశించి పౌలు మాట్లాడుతూ ఏ భేదము లేదు, అందరూ పాపము చేసి దేవుడను గ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారని రోమా 3:23లో పేర్కొన్నాడు. మానవజాతికి సంబంధిచి అనేక విషయాల్లో కొన్ని భేదా లుంటాయి. మరికొన్నిట్లో సారూప్యత ఉంటుంది. దుఃఖంలో వున్న వారి విష యంలో సానుభూతి చూపించుటలోను కష్టాల్లోవున్న వారికి సహాయం చేయుట లోను తేడాలుండక పోవచ్చు అయితే రక్షణ వెదకు చున్నవారికి సహాయ పడుటలో కూడా ఎటువంటి తేడా లేదు.

మొదటిగా మానవజాతికి భౌతిక అవసరతలు తీర్చుటలో ఏవిధమైన బేధ ములు ఉండవు. ధనికుడైనా, పేదవాడైనా, నల్లగావున్నా, తెల్లగావున్నా, జ్ఞానియైనా, బుద్ధిహీనుడైనా, ముసలివాడైనా, పడుచు వాడైనా, భారతీయుడైనా, ఆఫ్రికా, అమెరికా వాసియైనా మనందరికీ సంతోషము, దుఃఖము, ఆశ, నిరాశ, ధైర్యం, పిరికితనం, ప్రేమ, ద్వేషం అనేవి సహజం. అయితే అవి అందరికీ సమానము కావు.

రెండవదిగా పాపము విషయంలో లెక్క అప్పగించడంలో వ్యక్తుల మధ్య తేడా లేదు. అందరునూ పాపము చేసి దేవుడను గ్రహించు మహిమను పొందలేక పోవు చున్నారు (రోమా 3:23). మానవ జాతి కంతకూ క్రీస్తు రక్షకుడనే ఆవస్యకత ఉంది. పాపము పాపమే అందులో తేడాలేదు. అది మన నాశనమునకు హేతువని అనేక పర్యా యములు మనం వింటున్నాం. ఇది యదా ర్ధము ఏ పాపమైనా అతడు పశ్చాత్తాపపడి పాపక్షమాపణ పొందకపోతే అది అతని ఆత్మను నశింప చేస్తుంది. అందులో మరో మాటకు తావు లేదు. పాపంలో రకాలు, వాటికి కొలతలు వుంటాయనేది యదార్థం కాదు. నాది చిన్న పాపము నీది పెద్ద పాపము అని లెక్కించే వీలులేదు. మనుష్యులు ఇలా ప్రార్థించడం మనం వింటుంటాం. 'ప్రభువా పాపములో నశించు వారిని రక్షించు. మాత ప్పిదాన్ని, అపరాధాన్ని మన్నించు'. అనగా నీవు పాపం చేశావని నేను తప్పులు అప రాధాలు చేశానని కాదు. బైబిలు బాగా చది వితే పాపములోని తేడాలు కన బడతాయి. యేసు పిలాతుతో మాట్లాడుతూ నన్ను నీకు అప్పగించిన వానికి ఎక్కువ పాపము కలదు

(యోహాను 19:11) అన్నారు. మత్తయి 21:31లో సుంకరులును, వేశ్యలును మీకంటే దేవుని రాజ్యములో ముందుగా ప్రవేశింతురని యేసు చెప్పిన మాట దీనిని సూచించుచున్నది. కొన్ని సందర్భాలలో తామే నీతిమంతులమని తలంచేవారు వేశ్యల కంటే పాపులని దేవుని వాక్యం చెబుతుంది. తన యజమానుని చిత్తమెరిగి యుండియు, సిద్ధపడకయు, అతని చిత్తము చొప్పున జరిగింపకయు వుండు దాసునికి అనేకమైన దెబ్బలు తగులును (మత్తయి 12:47). మత్తయి 12:38-40లో విమర్శ దినమును గూర్చి ఆయన తెలియచేస్తున్నారు. ఈ భాగంలోని ముఖ్యాంశ మేదనగా ప్రతి వ్యక్తి యొక్క పాపమును గూర్చి ఏవిధమైన బేధమును లేదు. ఆ పాపం పెద్దగా లేక చిన్నగా అనిపించినా పాపము పాపమే. మనము ఆయన పవిత్ర రక్తం ద్వారా శుద్ధీకరింపబడే వరకూ మనం రక్షణ పొందలేము. మనం ఆయనను అంగీకరించి ఆంయన కృప ద్వారా రక్షణపొందవలెను.

మూడవదిగా దేవుడు మనందరి ఎడల చూపుతున్న ప్రేమలో బేధములేదు. మనలను వివిధ రీతులలో ప్రేమించు చుండవచ్చు. నీ పాపము ఎంత పెద్దదైనా ఆయన నిన్ను ప్రేమిస్తున్నారు. నీవు రక్షించబడాలని కోరుకొంటున్నారు. అది ఇప్పటికి నా ఊహకు అందని యదార్థత. దేవుడు మనలను ఎంతగా ప్రేమించినా మనం పశ్చాత్తాపపడి ఆయన మార్గమునకు మళ్ళకుంటే మనకు రక్షణ దొరకదు. అది ఆయన నియమించిన మార్గమై యుండాలి. వారి అవివేక హృదయము అంధకార మాయెను. తాము జ్ఞానులమని చెప్పుకొనుచు బుద్ధిహీనులైరి (రోమా 1:22) అని దేవుని వాక్యం చెబుతుంది. కొందరు ఆలస్యమని ఎంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని ఎవడును నశింప వలెనని యిచ్ఛాయింపక అందరూ మారుమనస్సు పొందవలెనని కోరుచూ మీ ఎడల దీర్ఘ శాంతము గలవాడై యున్నారు (2 పేతురు 3:9).

నాలుగవదిగా రక్షణ విషయములో క్రీస్తు పధకము నందు ఏ బేధమును లేదు. నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నాను. నా ద్వారా తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాడు (యోహాను 4:16) అని యేసు చెప్పి యున్నారు. ఆయన దీనికి ప్రత్యామ్నాయమేమి ఇవ్వలేదు. నేను ఆయనని మీరు విశ్వసించని ఎడల మీరు పాపములోనే యుండి చనిపోవుదురు

(యోహాను 8:24) అని యేసు చెప్పారు. మీరు మారుమనస్సు పొందని ఎడల మీరందరూ అలాగే నశింతురు (లూకా 13:3). ఒకడు రక్షణ పొందాలంటే నోటితో ఒప్పుకోవాలనేది ఇప్పటికీ యదార్థమే 'బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించు చున్నది. (1 పేతురు 3:21). అది ఇప్పటికీ నిలకడైన నిజం. నీవు ఇప్పటికీ ఈ కార్యాలు చేయకపోతే నీవు రక్షణపొందలేదని తెలుసుకో. గుర్తుంచుకో!

✍ - టి. పెర్సి బ్రౌన్

# యేసును గూర్చిన చారిత్రక ఋజువు

(Historical Evidence of Jesus)

థాల్లస్ అనే సమరయ జాతకి చెందిన చరిత్రకారుడు సుమారు క్రీస్తు శకం 52లో 'రోమును' గూర్చి వ్రాశాడు. అతను వ్రాసిన ప్రతులు పూర్తిగా ప్రస్తుత కాలంలో లభించడంలేదు కానీ కొన్ని అంశాలు చెలామణిలో వున్నాయి. రెండో శతాబ్దంలో జీవించిన జూలియస్ ఆఫ్రికానస్ 'థాల్లస్' రచనలలోని అంశాలను ప్రస్తావిస్తూ సూర్యుడు మరుగైన చీకటి సందర్భాన్ని థాల్లాస్ తన మూడో చరిత్రల పుస్తకంలో పేర్కొన్నట్లు రాశాడు.

ఈ చీకటి యేసుక్రీస్తు శిలువలో వ్రేలాడిన మూడు గంటల సమయంలో లోకమంతా చీకటి కమ్ముకోడాన్ని తెలియజేస్తుంది. మధ్యాహ్నము మొదలుకొని మూడు గంటల వరకు ఆదేశమంతటను చీకటి కమ్మెను (మత్తయి 27:45 మార్కు 15:33 చూడము). ఆ చీకటిని థాల్లస్ సూపర్ నేచురల్ ఈవెంట్ అస్వాభావికం గా కాక ప్రకృతి సిద్ధంగా సూర్యునికి, భూమికి మధ్య చంద్రుడు వచ్చినప్పుడు ఏర్పడే సూర్య గ్రహణంగా అతను పేర్కొన్నాడు. కానీ ఆఫ్రికానస్ దాని గూర్చి వివరిస్తూ ఆ చీకటి సూర్యగ్రహణం కాదని, ఎందుకంటే సూర్య గ్రహణం రోజున పూర్తి చంద్రుడు కనిపించడం తటస్థించదని రాశాడు. యేసు పస్కా పండగ రోజున శిలువ వేయబడెనని ఆ రోజు పౌర్ణమి అయినందున చంద్రుడు పూర్తిగా కనిపించాడని తన పరిశీలనలో పేర్కొన్నాడు.

థాల్లస్ క్రైస్తవ్యానికి వ్యతిరేకి. యేసు క్రీస్తు దేవుని కుమారుడన్న విషయాన్ని తాను

నమ్మలేదు. ఏదేమైనా, ఆ చీకటిని గూర్చి వివరిస్తూ ఆ చీకటి యేసు శిలువ మరణ మప్పుడు సంభవించిందని నిర్ధారించాడు. థల్లాస్ ఆ చీకటి కారణాన్ని గూర్చి మాత్రమే వాదించాడు గాని దాని వెనుక వున్న సత్యాన్ని గుర్తించి తెలుసుకోలేక పోయాడు. కాబట్టి క్రీ॥శ॥ 52లోని రాతల వల్ల ఈ చరిత్ర కారుని పరిశీలనలో బైబిల్‌లోని మూడు చారిత్రకాంశాలు సత్యాలని నిర్ధారణ అయ్యింది. 1. యేసు మాయా రూపం కాక నిజమైన వ్యక్తి అని 2. ఆ యేసు శిలువ వేయబడ్డాడని 3. యేసు శిలువ వేయబడి నప్పుడు చీకటి కమ్మిందని ఋజు వయ్యింది.

నజరేయుడైనయేసు ఒక పురాణకధ కాదు. మానవ చరిత్రకారులు యేసు నిజ మైన వ్యక్తి అని ఆయన నేలపై నడయాడా డడని నిర్ధారించారు. క్రొత్త నిబంధన నజరే యుడైన యేసును గూర్చిన సత్యాలతో పాటుగా ఆయన దైవికవ్యక్తిత్వాన్ని వెల్లడి చేస్తోంది. ఈ పేజిల్లోని విషయం యేసు క్రీస్తు దేవుని కుమారుడని (యోహాను 20:31) మనకు సాక్ష్యమిస్తుంది.

✍ - రాయ్‌స్ ప్రెడంక్

# దేవుడే మానవునిగా వచ్చినట్లయితే

(If God became a man)

దేవుడే మానవునిగా వచ్చినట్లయితే ఆయన నుంచి అద్భుతాలు, మహత్కా ర్యాలను మనం ఆశిస్తాం. యేసు చేసిన అద్భుతాలు ఈ విషయాన్ని ఋజువు చేస్తున్నాయి.

దేవుడు-మానవరూపంలో వస్తే దేవుని ప్రేమను ఆయన నుండి ఆశిస్తాం. క్రీస్తు చూపిన నిస్వార్ధ ప్రేమ దీనిని ఋజువు చేస్తుంది. ఆయన పాపులను, గురికి చెదరిన వారిని, పశ్చాతాప్తులను, హీనులను, దీను లను అక్కున చేర్చుకున్నారు. ఆయన తన అత్యున్నత ప్రేమను సిలువ మ్రానుపై కనుపరచారు.

దేవుడే మానవునిగా వస్తే సత్యవంతు డైన వ్యక్తిత్వాన్ని ఆయన నుంచి ఆశిద్దాం. ఏది సత్యమో మానవుడు ఎలావుండాలో దేవుడు చూపుతాడు ఆయన మనమెలా వుండాలో చెబుతాడు.

యేసు తన వ్యక్తిత్వం దైవికమైనదనీ

మహాగొప్ప బుజువులను మనముం దుచారు.

క్రైస్తవ్యం క్రీస్తు చేసిన అద్భుతాల ద్వారా పరీక్షింపబడగలదని నేను నమ్ముతాను. అద్భుతాలు లేకుండా కొత్తనిబంధనను నమ్మగలమా? అద్భుతాలు క్రీస్తు బోధనలను బలపరిచాయి. తన దైవత్వపు నిరూపణకోసం యేసు అద్భుతాలను చేశారు (యోహాను 10:24, 37, 38; లూకా 7:20-22). ఈ అద్భుతాలు చారిత్రక వెలుగులో చేయబడ్డాయి. చాలా అద్భుతాలను బహిరంగంగా ఆయన చేశారు. చాలా అద్భుతాలు ఆయన అవిశ్వాసులలో విశ్వాసం పాదుకొల్పడానికి చేశారు. అన్ని రకాల స్వస్థతలు జరిగాయి. స్వస్థత పొందిన వారి సాక్ష్యాలు కావలసినన్ని ఉన్నాయి. ఆయన చేసిన అద్భుతాల విషయమై విరుద్ధమైన భావనలేదు.

క్రీస్తు మృతులలో నుండి లేవడం ద్వారా క్రైస్తవ్యం పరీక్షింపబడిందని నేను నమ్ముతాను. పునుత్థానము అద్భుతం. అవిశ్వాసము అభిప్రాయములన పటాపంచాలు చేయడానికి చారిత్రక కాలాన్ని వివరించడానికి, ఈ అద్భుతాన్ని విడిచిపెట్టే అవకాశం లేదు. అంతేకాక ఆయన మృతులలో నుండి లేచిన తర్వాతే పలు సందర్భాలలో ఆయనను చూసిన వందలాది మంది సంగతేంటి? (1కొరింథి 15). సాక్ష్యము స్థిరమైనది మరియు క్రీస్తు యందు విశ్వాసము నిశ్చలమైనది.

- మ్యేక్స్ పీటర్సన్

# వెయ్యేండ్ల పాలన ఎక్కడిది - మానవునిదా? దేవునిదా?

(Premillenialism, from Man or God?)

క్రీస్తు శకము మొదటి శతాబ్ధములో తన రాజ్యమును స్థాపించుటకు దేవుడు సంకల్పించాడు (దాని. 2:44). ఆ రాజ్యాన్ని స్థాపించడానికి క్రీస్తు మొదటి శతాబ్ధములో వచ్చారు (మార్కు 9:1). "నీవు రాజువా?" అని పిలాతు యేసు నడిగాడు. యేసు "నీవన్నట్టు నేను రాజునే, సత్యమునుగూర్చి సాక్ష్యమిచ్చుటకు నేను పుట్టితిని, ఇందు నిమిత్తమే యీ లోకమునకు వచ్చితిని" అని చెప్పారు (యోహాను 18:37). ఆయన ఏమి

చేయడానికి వచ్చారో దాన్ని సాధించారు. దేవునికి ప్రార్థిస్తూ "చేయుటకు నీవు నా కిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చి తినని" ఆయన పలికారు (యోహాను 17:4). ఎవడైనా దేవుని రాజ్యము స్థాపించ బడిందనే వాస్తవాన్ని అంగీకరించ డానికిది చాలును. అయినను రాజ్యము భావిలో ఎప్పుడో స్థాపించబడునని ఎదురు చూచే వారున్నారు! వారు వెయ్యేండ్ల పాలన వాదులు. అయితే క్రీస్తు భూమిమీద వెయ్యేండ్ల మట్టుకు పాలన చేయునని చెప్పే లేఖనభాగమేమి లేదని గ్రహించుకోవాలి. రాజ్యము స్థాపింపబడకముందు రెండు ప్రాముఖ్య సంగతులు జరుగునని వెయ్యేండ్ల పాలనా వాదులు ఎదురు చూచుచున్నారు; అవి ఎత్తబడుట మరియు మహాశ్రమల కాలము.

## వెయ్యేండ్ల పాలనావాదులు చెప్పే ఎత్తబడుట

క్రీస్తు ఒక్కసారి కాదుగాని రెండు సార్లు తిరిగి వస్తాడని వెయ్యేండ్ల వాదులు చెప్తారు. వీరి బోధ ప్రకారము ఆయన మొదట వచ్చినప్పుడు మృతులైనట్టియు, సజీవులైనట్టియుతన అనుచరులను రహస్య ముగా కొనిపోవుటకు ఆయన వచ్చును. ఇదే ఎత్తబడుట అని వారు చెబుతారు. ఇలాగ రహస్యముగా ఎత్తబడినవారు తీర్పు తీర్చ బడి తమ ఫలములను పొందుతారు. మరి ఏడు సంవత్సరముల మట్టుకు వారు ప్రభు వుతో పరలోకములో ఉంటారని వారు చెబుతారు.

## ఎత్తబడుట

లేఖనాల్లో 'ఎత్తబడుట' అనే మాట గాని దాని బోధగాని ఏమీ లేదు. సరికదా క్రీస్తు మరలా వచ్చునప్పుడు ప్రతీ నేత్రము ఆయనను చూచునని బోధించు చున్నవి (ప్రకటన 1:7). మరియు ఆయన గొప్ప ఆర్భాటముతో, అగ్ని జ్వాలలతో, బూర ధ్వనితో వచ్చునని అవి బోధించుచున్నవి (2 పేతురు 3:10; 1 థెస్స 4:16; 17, 2 థెస్స 1:7-10). అంతేకాకుండా క్రీస్తు ఇంకా ఒకే ఒక్కసారి మాత్రమే తిరిగి వచ్చునని లేఖన ములు బోధించుచున్నవి (హెబ్రీ 9:28). అప్పుడు నీతిమంతులు, దుర్మార్గులు కూడా తీర్పు తీర్చబడి తమ క్రియలను బట్టి ప్రతిఫలమును పొందుదురు (2 కొరింథి 5:10; ప్రకటన 22:12). మరల గురుగులను గూర్చి క్రీస్తు చెప్పిన ఉపమానము ప్రకారము దుర్మార్గులకు శిక్ష విధింపబడక ముందు నీతిమంతులు ప్రత్యేకముగా తీర్పు తీర్చ బడుటకు రహస్యముగా కొనిపోబడరు (మత్తయి 13:24-43). అట్టి అబద్ధ బోధకు

దేవుని వాక్యములో సమయం, స్థానం ఇయ్యబడలేదు.

## మహాశ్రమల కాలము

పరిశుద్ధులు పైకెత్తబడిన తరువాత, ఏడు సంవత్సరముల మట్టుకు "మహాశ్రమల కాలము" సంభవించునని వెయ్యేండ్ల పాలనా వారు వాదిస్తారు. పై కెత్తబడగా భూమిమీద మిగిలిపోయినవారు అంతకంతకు ఎక్కువయిన శ్రమలను ఎదుర్కొంటారు. ఈ ఏడు సంవత్సరాలలోను (ఎత్తబడియున్న కారణము వలన భూమిమీద క్రీస్తుగాని, పరిశుద్ధాత్ముడుగాని, రక్షింపబడిన వారెవరు గాని లేకపోయినను) ప్రజలు ఎలాగో ఒకలాగున యేసుక్రీస్తువైపు మార్పు జెందుతారు. ఈ ఏడు సంవత్సరముల శ్రమలకాలపు మధ్యలో మహాశ్రమ కాలము ఆరంభమగును. అంత్య క్రీస్తు దర్శనమిస్తాడు. అప్పుడు ఇశ్రాయేలీయులు అతనితో నిబంధన చేసుకుంటారు. క్రొత్త పరిశుద్ధులు హతమార్చబడతారు. పరిస్థితి అంతా పాడైపోతాది. చివరిగా, మానవ జాతి నాశనము గావించబడక ముందు, క్రీస్తు తన రాజ్యమును స్థాపించుటకు మరింకొకసారి దర్శనమిస్తారు. పైకెత్తబడుటను గూర్చినయట్లే ఈ మహాశ్రమ కాలమును గూర్చి కూడా వెయ్యేండ్ల పాలనా వాదులు పొరబడ్డారు.

క్రొత్తనిబంధనలో యేసుగాని, అపొస్తలులుగాని శ్రమను గూర్చి కనీసం ఇరవైసార్లు పలికారు. శ్రమ అంటే నమ్మకమైన క్రైస్తవులకు కలిగే బాధలు, శోధనలు, హింసలని వారి ఉద్దేశము. యేసు ఇట్లన్నారు : "దాసుడు తన యజమానుని కంటే గొప్పవాడు కాడని నేను మీతో చెప్పిన మాట జ్ఞాపకము చేసికొనుడి. లోకులు నన్ను హింసించిన యెడల మిమ్మును కూడ హింసింతురు" (యోహాను 15:20). "మీ సహోదరుడును, యేసును బట్టి కలుగు శ్రమలలోను రాజ్యములోను, సహవాసములోను పాలివాడునైన యోహానను నేను" అని యోహాను తన్ను గూర్చి చెప్పుకున్నాడు (ప్రకటన 1:9). "అనేక శ్రమలు అనుభవించి మనము దేవుని రాజ్యములో ప్రవేశింపవలెనని" అపొ.కార్యములు 14:22 బయలు పరచుచున్నది. అట్టి శ్రమలలో పాలివారై యున్నట్టుగా మనము మహా ఆనందముతో సంతోషించాలి (1 పేతురు 4:13). ఏలయనగా పరలోకమందు మన ఫలము అధికమగును (మత్తయి 5:10-12). ప్రభువు వచ్చు వరకు ఈ లోకము అంతమయ్యే వరకు శ్రమలు కలుగుచునే ఉంటాయి.

## ముగింపు

క్రీస్తు విధించిన రక్షణ షరతుల నంగీకరించని వానికి రెండవ తరుణం అంటూ ఏమీ ఉండదు. క్రీస్తు మరల వచ్చునప్పుడు అంతము సంభవించును. అయితే క్రీస్తు మరల ఎప్పుడు వచ్చు చున్నాడు? దేవునికి తప్ప మరెవరికి తెలియదు (మత్త 24:36). "అయితే ప్రభువు దినము దొంగ వచ్చునట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించి పోవును, పంచభూతములు మిక్కు టమైన వేండ్రముతో లయమైపోవును, భూమియు దానిమీదనున్న కృత్యములు కాలిపోవును" (2 పేతురు 3:10). యేసు క్రీస్తు మరల తప్పక వచ్చుచున్నారు, గాని వెయ్యేండ్ల పాలనావాదుల కార్యక్రమము ప్రకారము కాదు. "ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము" (2 కొరింధి 6:2). ప్రభువు ఎప్పుడు వచ్చునో ఎవనికి తెలియదు గనుక మెలకువగా వుండి ప్రార్ధన చేయుడి (మత్తయి 24:42, మార్కు 13:13).

నీవు ఇప్పుడు ఆయన రాజ్య నివాసుడవా? ఆయన రాకడకొరకు సిద్ధపడి యున్నావా?

✍ - మాంటీ మెక్‌నైర్

# నీవు క్రైస్తవునిగా మాత్రమే యుండవచ్చును

(You can be just a Christian)

నీవు క్రైస్తవునిగా మాత్రమే యుండ వచ్చునని ఎన్నడైనా తలంచావా? అంతకు ఎక్కువ కాదు, తక్కువ కాదు, నీవు కేవలం క్రైస్తవునిగా యుండవచ్చును. ఈలోకం అంతా మత సంబంధముగా గందర గోళంలో యున్నది. వివిధ డినామినేషన్ల వలె విభజింపబడి యున్నది. అయినాసరే నీవు క్రైస్తవునిగా మాత్రమే యుండవచ్చును.

క్రైస్తవునిగా మాత్రమే యుండుట అంటే పౌలు, పేతురు, ఫిలిప్పు మొదలగు వారి వలె యేసునందు విశ్వాస ముంచడం, ఆయనకు లోబడడం. మొదటి శతాబ్ద ములో యున్న ఆదిమక్రైస్తవుల మాదిరి ననుసరించడం. అంటే నేడు ప్రబలియున్న కేథలిక్కు, ప్రొటెస్టాంటు బోధలకు, ఉపదేశ ములకంటే ముందునుండి యున్న క్రీస్తు

బోధ దగ్గరకు వెళ్ళుట అవసరం. దేవుడు తన సంఘానికి ఆత్మావేశముచే లిఖింపబడిన క్రొత్త నిబంధన గ్రంధములో బయలు పరచిన ఆయన చిత్తము యొద్దకు మరలి వెళ్ళాలి.

క్రైస్తవ్యము ఆరంభములో వివిధ డినామినేషన్లు లేవు. ఆదిమ శిష్యులందరు ఒకే శరీరములో యుండిరి. వారు కేవలం క్రైస్తవులని మాత్రమే పిలువబడిరి (అపో.కా. 11:26). వారు వివిధ విశ్వాస ప్రమాణముల ననుసరించలేదు గాని పరిశుద్ధులకు ఒక్కసారి అప్పగింపబడిన బోధను అనుసరించారు (యూదా : 3). మొదట్లో నోటిమాట ద్వారాను, తదుపరి పరిశుద్ధాత్మచే నడిపింపబడిన దైవజనులు ద్వారా లిఖిత పూర్వకముగాను యున్న క్రొత్త నిబంధన ఒక్కటి మాత్రమే వారి విశ్వాసమునకు కార్యాచరణకు మూలమాయెను (2 పేతురు 1:21). నేడు మనకును అదే క్రొత్త నిబంధన యున్నది. గనుక మొదటి శతాబ్దములో యుండిన క్రొత్త నిబంధన క్రైస్తవ్యాన్ని నేడు మనమును పునరుద్ధరించగలము.

యేసు ఒకే ఒక్క సంఘమును నిర్మించెను. సువార్తకు ఎవరు లోబడినా వారిని దేవుడు ఏశాఖకు చెందని ఈ సంఘముతో చేర్చుచుండెను (మత్తయి 16:18 అపో.కా. 2:47). నేడు నీవు యేసు ప్రభువు నందు విశ్వాసముంచి (యోహాను 8:24) నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది (లూకా 13:3), యేసే దేవుని కుమారుడని మనుష్యుల ఎదుట ఒప్పుకొని (మత్తయి 10:32; రోమా 10:9-10), పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన యెడల నేడు నీవును అదే సంఘముతో చేర్చబడుదువు (అపో.కా. 2:38; మత్త 28:19; అపో.కా. 22:16; రోమా 6:3-5).

క్రొత్త నిబంధన యిచ్చు ఈ సూత్రములను పాటించుచు నీవు సూక్ష్మముగా క్రైస్తవునిగా ఎందుకు వుండరాదు? క్రీస్తు సంఘములోనే యుంటూ ఏ డినామినేషన్‌లోను లేకుండా నీవు మీ సమాజములో ఎందుకు సేవ చేయరాదు?

- ఫ్రెడ్ యేట్స్

గమనిక : సత్యవాక్కు కావలసినవారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

SATYA VANI, P.O. BOX-80, KAKINADA - 533 001.

# "నా మాట అగ్నివంటిది కాదా?"

*(Is not my Word like a Fire?)*

"నా మాట అగ్నివంటిది కాదా? బండను బద్దలు చేయు సుత్తెవంటిది కాదా?" యని యిర్మీయా 23:29 లో యెహోవా దేవుడు చెప్పుచున్నాడు.

దేవుని వాక్యమైన బైబిలు అనేక విధములుగ అగ్నివలె యున్నది. వాతావరణం చాల చలిగా యున్నప్పడు వేడిని సుఖాన్ని కలిగించ డానికి అగ్నిని వినియోగిస్తాము. అట్లే మనకు బాధ కలిగినప్పడు బైబిలు మనకు నెమ్మది కలుగజేస్తాది. దావీదు ఇట్లు చెబుతున్నాడు : "నీ వాక్యము నన్ను బ్రతికించియున్నది. నా బాధలో ఇదే నాకు నెమ్మది కలిగించుచున్నది" (కీర్తన 119:50).

చీకటిలో వెలుగు నిచ్చుటకు మనము అగ్నిని రాజబెట్ట వచ్చును. పాపు చీకటిని పారద్రోలే వెలుగు దేవుని వాక్యము. యేసు ప్రభువు ఇట్లు చెప్పారు: "ఆతీర్పు ఇదే వెలుగు లోకములోనికి వచ్చెను, గాని తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించిరి. దుష్కార్యము చేయు ప్రతివాడు వెలుగును ద్వేషించును, తన క్రియలు దుష్ క్రియలుగా కనబడకుండు నట్లు వెలుగు నొద్దకురాడు. సత్య వర్తనుడైతే తన క్రియలు దేవుని మూల ముగా చేయబడియున్నవని ప్రత్యక్ష పరచబడునట్లు వెలుగు నొద్దకు వచ్చును" (యోహాను 3:19, 20). బైబిలు మనకు మార్గాన్ని చూపి స్తుంది: "నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునై

యున్నది" (కీర్తన 119:105).

పవిత్ర పరచి పరిశుద్ధ పరచుటలో దేవుని వాక్యము అగ్నివలె యున్నది. కలుషితమైనవి కరగిపోవునట్లు ప్రశస్త పదార్థములు పుటము వేయబడ్తాయి. మన జీవితాల్లో పాపముపై బైబిలు యొక్క ప్రభావం అట్టిదే. "నేను మీతో చెప్పిన మాటనుబట్టి మీరిప్పుడు పవిత్రులై యున్నారు" (యోహాను 15:3).

అవును దేవుని వాక్యము అగ్నివంటిదే. అది మనకు ఆదరణ నిచ్చును, త్రోవకు వెలుగు చూపును, పాపము నుండి మనలను పవిత్రులుగా చేయును. బైబిలు కొరకు దేవుని వందనములు.

❄ ❄ ❄ ❄

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:
SATYA VAKKU
P.O. Box 80,
Kakinada - 533 001

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.